



తల్లిదండ్రులతో సైనికుడు మురళీనాయక్ (ఫైల్ ఫొటో)




ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

'అనంత' చెరువులన్నీ అనుసంధానం

- హంద్రీనీవాకు అధిక ప్రాధాన్యత
- జులై 10న హంద్రీనీవాకు నీరు విడుదల
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- ఛాయాపురం వద్ద హంద్రీనీవా పరిశీలన
- అధికారులతో సమీక్ష
- గ్రామస్తులు, సాగురైతులతో ప్రజావేదిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, ఉరవకొండ

అనంతపురం జిల్లాలోని చెరువులన్నింటినీ అనుసంధానం చేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని ఛాయపురం వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలించారు. కాలువ వెడల్పు పనులను ఎప్పటిలోపు పూర్తి చేస్తారని అధికారులను అడిగారు. 50 రోజుల్లోపు హంద్రీనీవా కాలువ వెడల్పు పూర్తి చేస్తామని హంద్రీనీవా ఎస్ఇ తెలిపారు. ప్రస్తుతం 1500 క్యూసెక్కులు మాత్రమే నీటి ప్రవాహం కాలువ గుండా ఉండేదని, వెడల్పు పూర్తవుతే 3500 క్యూసెక్కుల వరకు నీటిని తీసుకునే అవకాశం ఉందని ఎస్ఇ ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతరం ఛాయపురం వద్ద ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మరణించిన మురళీ నాయక్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన కార్యాక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతపురం జిల్లా అంటే ప్రత్యేకమైన అభిమానం అని చెప్పారు. ఈ జిల్లా తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కరువు జిల్లా అనంతపురం జిల్లాకు సాగునీటిని అందించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు ఎన్టీఆర్ హంద్రీనీవాకు రూపకల్పన చేస్తే తెలుగుదేశం పార్టీ వాటిని పూర్తి చేసే కార్యక్రమం చేపడుతోందన్నారు. 2014 నుంచి 2019 మధ్య రూ.నాలుగు వేల కోట్లకుపైగా నిధులను హంద్రీనీవా ఖర్చు పెట్టినట్టు చెప్పారు. ఇప్పుడు రూ.3500 కోట్లు వెడల్పు, కాలువ లైనింగుకు ఖర్చు పెడుతున్నామని వివరించారు. డ్రిప్ స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. పోలవరం నుంచి బనకచెర్లకు నీటి మళ్లింపు ద్వారా కరువు ప్రాంతాలకు 300 టిఎంసిల నీళ్ల మళ్లించే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇది చేయగలిగితే రాష్ట్రంలో కరువు అన్నది లేకుండా చేయవచ్చన్నారు. పి4 ద్వారా పేదరికం రూపుమాపేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజావేదిక జరుగుతున్న ఛాయపురంలో 96 బంగారు కుంటుంబాలు ఉన్నాయన్నారు. వాటిని ఎవరైనా దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఛాయపురంలో దత్తత తీసుకోవడానికి సుజలన్, సిఫ్లాన్, ఆర్జాన్ ప్రతినిధులు ముందుకొచ్చారు.





హంద్రీనీవా పనుల పురోగతిని మ్యాప్ ద్వారా చంద్రబాబు నాయుడుకు తెలియజేస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఒక్క గంప మన్ను వైసిపి ప్రభుత్వం ఎత్తలేదన విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు రూ.72 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టినట్టు చెప్పారు. ఇప్పుడు కూడా రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి అధిక ప్రాధాన్యతనిచ్చినట్టు తెలిపారు.



- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ కలిగిన నాయకులని చెప్పారు. 30 ఏళ్ల క్రితమే డ్రిప్ సిస్టమ్ గురించి పరిశీలనకు ఇజ్రాయిల్ దేశం పంపించారన్నారు. ఇప్పుడు డ్రిప్‌లేని వ్యవసాయాన్ని అనంతపురం జిల్లాలో ఊహించగలమా అని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగులోనున్న సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, గుమ్మనూరు జయరాం, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కియా ఇండియాతో ఐఐటి తిరుపతి ఎంఒయు

ప్రజాశక్తి-పెనుకొండ

కార్ల తయారీ సంస్థ కియా ఇండియా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తిరుపతి (ఐఐటి-తిరుపతి)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు శుక్రవారం తిరుపతిలో ఎంఒయుపై సంతకం చేశారు. కియా ఇండియా ఐఐటి-తిరుపతిలో విద్య, మౌలిక సదుపాయాలు, పరిశోధన కార్యక్రమాలు తదితర అంశాలకు సహకారం అందించనుంది. ఇందు కోసం ఐదేళ్లలో (2025-29) రూ. 35 కోట్లు ఖర్చు చేయనుంది. అధునాతన తయారీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, సస్టైనబుల్ ఆటోమోటివ్ సాంకేతికతలో ఐఐటి-తిరుపతిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థుల కోసం ఇంటర్న్ షిప్, ప్రీ-ప్లేస్మెంట్ ఆఫర్లు(పిపిఒఎస్) విద్యారంగం, పరిశ్రమల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి. ఎంటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆర్థిక సాయం అందించడంతో పాటు 'మేకర్స్ ల్యాబొరేటరీ' ఏర్పాటు చేయనుంది. విద్యార్థులు నూతన సాంకేతిక ఆవిష్కరణలు చేయగలి గేలా, క్రాస్-డిసిప్లినరీ ప్రాజెక్టులకు అనుకూలంగా రూపొందుతుంది. కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగ్లా లీ మాట్లా డుతూ ఇది కేవలం ఒక అవగాహన ఒప్పందం కాదు, భారత్‌లో మొబిలిటీ, ఇంజినీరింగ్ భవిష్యత్తు కోసం సార్వత్రిక దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను అభివృద్ధి చేయడమే కాక, సస్టైనబుల్ మొబిలిటీ, పరిశ్రమ తయారీలో అభివృద్ధికి నాయకత్వం వహించగల ప్రతిభను వెలికితీయాలని ఆశిస్తున్నామన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఐఐటి-తిరుపతి, కొరియాలోని ప్రసిద్ధ యూనివర్శిటీల మధ్య అంతర్జాతీయ విద్యాభాగస్వామ్యాలకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఐఐటి-తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ కియా ఇండియాతో చేతులు కలపడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి పరిశ్రమ అనుభవాలు, నైపుణ్యాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు అందిస్తుందన్నారు. ప్రభావవంతమైన ఆవిష్కరణలు సృష్టిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు

జమ్ములో జవాను 'వీర'మరణం



మురళీ నాయక్(ఫైల్ ఫొటో)



- పాకిస్తాన్ కాల్పుల్లో సత్యసాయి జిల్లా సైనికుడి మరణం
- గోరంట్ల మండలం కళ్లితండాలో విషాద ఛాయలు
- ఒక్కగానొక్క కుమారున్ని కోల్పోవడంతో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు
- సైనిక కుటుంబానికి పలువురి పరామర్శ
- నేడు పార్థివదేహం స్వగ్రామానికి వచ్చే అవకాశం

నేడు స్వగ్రామానికి పార్థివదేహం

జవాను పార్థివదేహం ప్రత్యేక హెలికాప్టర్‌లో కల్లితండాకు పంపేలా ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మీ అధికారులు, కుటుంబ సభ్యుల సూచన మేరకు స్వగ్రామంలో మురళీ నాయక్ అంత్యక్రియలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం గోరంట్ల, సోమందేపల్లి

భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గం గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్ (22) వీర మరణం పొందారు. గురువారం రాత్రి జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో ఈ జవాన్ మరణించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ గురువారం రాత్రి జరిపిన కాల్పుల్లో జవాన్ మురళీనాయక్ వీర మరణం పొందారు. ఈయన మృతి విషయాన్ని భారత దేశ ఆర్మీ ఉన్నతాధికారులు శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు, జవాన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. జవాన్ పార్థివదేహం శనివారం తన స్వగ్రామానికి తెచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కుటుంబ నేపథ్యం..

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డం తండా పంచాయతీ కళ్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్‌ది సాధారణ రైతు కుటుంబం. తండ్రి శ్రీరామ్ నాయక్, తల్లి జ్యోతిబాయి ఇద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మురళీనాయక్ ఒక్కడే ఏకైన సంతానం. ఒక్కగానొక్క కుమారుడు సైన్యంలోకి వెళ్లి దేశానికి సేవ చేస్తానని చెప్పగానే అడ్డు చెప్పకుండా తల్లిదండ్రులు అతన్ని సైన్యంలోకి పంపారు.

విద్యాభ్యాసం..

కళితండాకు చెందిన మురళీనాయక్ విద్యాభ్యాసం సోమందేపల్లి, అనంతపురంలో కొనసాగింది. చిన్నతనంలో సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివాడు. ఇంటర్, డిగ్రీని అనంతపురంలో పూర్తి చేశాడు. 2019-2022లో బీకాం చదివాడు. డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఆర్మీ ఉద్యోగాన్ని సంపాదించి సైన్యంలోకి వెళ్లాడు. డిగ్రీ చదివే రోజుల్లోనే చదువుతో పాటు ఎన్‌సిసి, క్రీడల్లో చురుగ్గా ఉండేవాడు.

దేశభద్రతలో పాలు పంచుకోవాలని...

మురళీ నాయక్ ఇంటర్ చదివే రోజుల నుంచే ఆర్మీలోకి వెళ్లానే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. ఆ ఉద్యోగం సంపాదించేందుకు నిరంతరం కృషి చేశాడు. అనుకున్న లక్ష్యం మేరకు డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న రోజుల్లో 29-12-2022న అగ్నివీర్ ఎంపికలో భాగంగా ఆర్మీలో ఉద్యోగం పొందాడు. ఇప్పటికి ఆయన సైన్యంలో చేరి 28 నెలలు అయ్యింది. సైన్యంలో చేరగానే నాసిక్‌లో శిక్షణ తీసుకున్నాడు. అక్కడి నుంచి అస్సాంలో ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. తర్వాత పంజాబ్‌లో విధులు నిర్వహించాడు. భారత్, పాకిస్తాన్ యుద్ధం ప్రారంభం కావడంతో రెండు రోజుల క్రితం జమ్ము కాశ్మీర్ సరిహద్దుకు వెళ్లాడు. అక్కడ జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందాడు.

రెండు రోజుల క్రితం తల్లిదండ్రులకు ఫోన్

పంజాబ్‌లో విధులు నిర్వహిస్తున్న మురళీనాయక్ రెండు రోజుల క్రితం జమ్ముకాశ్మీర్ బార్డర్‌కు వచ్చాడు. జమ్ముకాశ్మీర్‌కు వచ్చిన సందర్భంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొందని, అందులో తాను పాల్గొనబోతున్నానంటూ ఎంతో ధైర్యం మురళీనాయక్ ఫోన్‌లో చెప్పాడు. దేశం కోసం యుద్ధభూమిలో పోరాడడం చాలా సంతోషంగా ఉందనేలా తల్లిదండ్రలకు గర్వంగా చెప్పాడు. రెండు రోజుల క్రితం ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి ఇలా వీరమరణం పొందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యవతం అయ్యారు.

కల్లి తండాలో విషాదం

పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో జవాన్ మురళీనాయక్ మృతి విషయం తెలియగానే ఆయన స్వగ్రామం కల్లితండాలో విషాదం నెలకొంది. సౌమ్యుడి ఉంటూ అందరితోనూ చలాకీగా మాట్లాడే యువకుడు ఇలా కాల్పుల్లో మరణించిన విషయం గ్రామస్తులను కలిచివేసింది. మురళీనాయక్ ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు చేరుకుని తల్లిదండ్రులను ఓదార్చారు. గ్రామానికి ఎప్పుడొచ్చినా అందరినీ నవ్వుతూ పలకరించే వ్యక్తి ఇలా ముష్కరులు చేసిన కాల్పుల్లో అసువులు బాసడంపై గ్రామస్తులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

పలువురి పరామర్శ

యుద్ధంలో జవాను మృతి విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కల్లితండాకు తరలి వెళ్లారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మృతుని తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని తల్లిదండ్రులకు తెలిపారు. తక్షణం సాయంగా రూ.5 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. చిన్న వయసులోనే దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమైన ఘటన అని మంత్రి తెలిపారు. వీరసైనికుడు సేవలకు గుర్తింపుగా త్వరలోనే గోరంట్ల మండల కేంద్రంలో మురళీనాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం.శేఖర్ తదితరులు జవాను కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

జవాన్ మృతి బాధాకరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్



పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దాడులకు ప్రతిగా పాకిస్తాన్ జరుపుతున్న అక్రమ కాల్పుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ మరణించడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీనాయక్ సైన్యంలో చేరి చిన్న వయసులో మరణించడం బాధాకరం అన్నారు. చదువుకునే రోజుల్లో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో మురళీ నాయక్ పాల్గొని సమాజం పట్ల ఎంతో నిబద్ధతతో ఉండేవాడని గుర్తు చేశారు. చిన్న వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఫోన్

పాక్ కాల్పుల్లో మరణించిన మురళీనాయక్ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ ద్వారా పరామర్శించారు. అనంతపురం పర్యటనకు విచ్చేసిన ఆయన అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా సాయంగా ఉంటామని భరోసా నిచ్చారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత




జవాను మృతికి నివాళిగా అనంతపురంలో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

31న ఉచిత సామూహిక వివాహాలు

ప్రజాశక్తి-పెనుకొండ

ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి దంపతులు నిర్మించిన సాయిగీత ఏసీ కన్వెన్షన్ హాల్ ప్రారంభో త్సవం సందర్భంగా చేపట్టనున్న ఉచిత సామూహిక వివాహాలను పేదలు వినియోగించుకోవాలని మాజీ మంత్రి, వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ మాలగుండ్ల శంకరనారాయణ సూచించారు. పట్టణంలోని పెనుకొండ-పావగడ రహదారిలో నూతనంగా నిర్మించిన సాయిగీత ఏసీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఉచిత సామూహిక వివాహాల కరపత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా ఉచిత సామూహిక వివాహాలు చేయడం అభినందనీయమన్నారు. ఎంపిపి గీతా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలని, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు చూపించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పెళ్లిరోజు తాళిబొట్టు, మెట్టెలు, వధూవరులకు నూతన వస్త్రాలు అందిస్తామని, వధూవరుల తరపున వచ్చే బంధువులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్ ఫరూక్, వైస్ ఎంపిపి రామాంజనేయులు, నాయకులు శంకర్‌రెడ్డి, శివారెడ్డి, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, మహమ్మద్ తయూబ్, సద్దాం, శ్రీరాములు, మారుతి, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక వివాహ కరపత్రాలు విడుదల చేస్తున్న శంకర నారాయణ, తదితరులు

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు



వైసిపి అధినేత జగన్‌ను కలిసిన మడకశిర నాయకులు

మడకశిర : వైసిపి అధినేత జగన్‌ను శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసిపి సీనియర్ నాయకుడు తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు. ఆయన నియోజక వర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను జగన్‌కు వివరించారు. జగన్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

గర్భిణులకు అన్నదానం

లేపాక్షి : వైద్య పరీక్షల కోసం స్థానిక పిహెచ్‌సికి వచ్చిన గర్భిణులకు శుక్రవారం రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ దాదాపు 60 మంది మహిళలకు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణులు, రమానందన్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి : మండలంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ సిరివరం ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణవంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సిరివరం, కోడిపల్లి, తిరుమలదేవరపల్లి, గోపిందేవరపల్లి, గౌరీగానిపల్లి, విభూదిపల్లి, మనేపల్లి, నాగేపల్లి గ్రామల ప్రజలు సహకరించాలన్నారు.



విగ్రహ ప్రతిష్టాపన పూజలో పాల్గొన్న ఎంపి బికె పార్థసారథి

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో ఎంపి

రొద్దం : మండలంలోని కందుకూర్లపల్లి గ్రామంలో శుక్రవారం పెద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. ఎంపి బికె పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర అర్చకులు ఎంపిని శాలువాతో సత్కరించారు. అంతకుముందు స్థానిక టిడిపి నాయకులు ఎంపికి ఘన స్వాగతం పలికారు. అలాగే వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి శంకరనారాయణ ఆ పార్టీ మండల నాయకులతో కలిసి వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉషశ్రీచరణ్ గ్రామంలో ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తల ఇంటికి వెళ్లి పరామర్శించారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపు

లేపాక్షి : విద్యార్థుల కోసం ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకూ సిరివరం పంచాయతీ కేంద్రంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహమూర్తి శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులు ఉండి వాటి వల్ల పాఠశాల, కళాశాలలో చేరడానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహిస్తుం దన్నారు. 5-15ఏళ్ల వయసు పిల్లలు తప్పుల సవరణ, అప్డేట్ చేసుకోవాలన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో శుక్రవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్ఐ దినేష్‌కు సమ్మె నోటీసు అందించారు. సిఐటియు మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో కార్మికులు ప్రాణత్యాగాలు చేసి పోరాడి కార్మిక చట్టాలను సాధించుకు న్నారన్నారు. మొత్తం 29 చట్టాలు ఉండగా బిజెపి ప్రభుత్వం వాటిని లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరించేందుకు కుట్ర పన్నిందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్‌తో పాటు ఎపిలో ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు, ఇతర డిమాండ్లతో కార్మికులు సమ్మెలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, మహబూబ్ బాషా, నరసింహ, ఆనంద్, మున్సిపల్ ఫెడరేషన్ వెంకటేష్, నరసింహ, నరసమ్మ, చలపతి, వెంకటేష్, జబ్బార్, లక్ష్మీదేవి, మణి, అశ్వర్థప్ప, కార్మికులు పాల్గొన్నారు.



ఆర్ఐ దినేష్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు నాయకులు

వీర జవానుకు ఘన నివాళి



వీరజవాను చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు



మౌనం పాటిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు



వీరజవాను చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పాకిస్తాన్‌తో జరిగిన యుద్దంలో వీరమరణం పొందిన జిల్లాలోని గోరంట్ల మండలం తల్లి తండాకు చెందిన వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వీర జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన వీర జవాన్ ప్రదర్శించిన ధైర్య సాహసం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, ఎల్ఐసి నరసింహులు, సురేష్ నాయుడు, సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో నివాళులు... కలెక్టరేట్లో వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికికలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు నివాళులర్పించారు. వీర జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సరిహద్దులలో మురళి నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ సారధి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఆర్ఓ వేలాయుధం, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళి నాయక్‌కు స్థానికులు ఘన నివాళి అర్పించారు. నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమరా చంద్ర, మాణిక్యంఇస్సాకు, నాయుడు, నాగేంద్ర, శేఖర్, సాయి, పాపన్న, మిల్టీ సాయి, చలపతి, రఫీ, వలిపి శ్రీనివాసులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కల్లి తాండకు చెందిన వీర జవాన్ మురళి నాయక్‌కు మండల కేంద్రంలో సిపిఎం నాయకులు నివాళులు అర్పించారు. నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, గ్లోబల్ కంప్యూటర్ సంస్థ నాగేంద్ర, విద్యార్థులు మురళినాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పుట్టపర్తి రూరల్: దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ వీరమరణం యావత్ దేశానికి గర్వకారణమని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న అన్నారు. భారత్–పాక్ యుద్ధంలో సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ పరిధిలోని కల్లి తండాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి.రత్న శుక్రవారం గ్రామానికి వెళ్లి జవాను తల్లిదండ్రులను ఓదార్చారు. జిల్లా పోలీస్ శాఖ తరపున జవాన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం జరుగుతున్న యుద్ధంలో రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారని, యువ జవాను మురళీ నాయక్ పేరు భారతీయ చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని అన్నారు. ప్రభుత్వ లాంచనాలతో వీర జవాన్ అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐ శేఖర్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, అర్ఐ వలి, మహేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెనుకొండ: మారుమూల చిన్నతండాలో పుట్టిన మురళినాయక్ దేశం గర్వపడే వీరుడయ్యారని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత కొనియాడారు. వీర జవాన్ మురళినాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం మంత్రి సవిత ఆధ్వర్యంలో పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్, దర్గా సర్కిల్, శ్రీకృష్ణదేవరాయలు కూడలి, గాంధీ సర్కిల్ మీదుగా తెలుగుతల్లి విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జవాను మురళినాయక్ దేశాన్ని కాపాడాలి.. త్రివర్ణ పతాకం తలవంచకుండా నిలబెట్టేందుకు వీర మరణం పొందారన్నారు. జవాను మరణం కాదు ఇది దేశభక్తికి నివాళి, త్యాగం, ధైర్యం, గర్వం అన్నారు. మురళినాయక్ లాంటి వీరుల త్యాగం ఎప్పటికీ మన గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : పాకిస్తాన్ దేశంతో జరుగుతున్న యుద్ధంలో జిల్లాకు చెందిన మురళినాయక్ వీరమరణం పొం దారు. జవాను వీరమరణం పట్ల ఎపి కుంచిటి కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు నళిని రంగేగౌడ, ఎడిసిసి బ్యాంక్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఆనందరంగారెడ్డి నివాళుర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళినాయక్ కుటుంబానికి యావత్ భారతదేశం అండగా ఉంటుందని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హిందూపురం : పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు టిడిపి తదితర పార్టీల నాయకులు నివాళి అర్పించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కారక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, టీడీపీ సత్య సాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజినప్ప,కౌన్సిలర్లు, టీడీపీ సీనియర్ నాయకులు, టిడిపి కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పెనుకొండలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మంత్రిసవిత, తదితరులు



హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని జీనులకుంట దళితవాడ కు చెందిన బి వేమన్న (75) శుక్రవారం ఐజాక్ కంకర మిషన్ కింద పడి మృతిచెందాడని మృతుడి కుమారుడు ఆంజనేయులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. జమేదార్ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు సిసి రోడ్ వేస్తుండగా కాలకృత్యాలకు వెళ్లిన వేమన్న ఐజాక్ కంకర మిషన్ కిందపడ్డాడు. డ్రైవర్ గుర్తించలేకపోవడంతో ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ కల్లు తాగి వ్యక్తి...

ప్రజాశక్తి-పావగడ

కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం తాలూకాలోని మురేరాయనపల్లిలో చోటుచేసుకుంది. రొద్దం మండలంలోని చెరుకూరు వద్ద నిర్వహిస్తున్న ఓ కల్లు దుకాణంలో నంజుం డప్ప(40) కల్లు తాగిన తర్వాత అస్వస్థకు గురయ్యాడు. అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెంది నట్లు తెలిసింది. చెరుకూరు వద్ద నిర్వహిస్తున్న రెండు కల్లు దుకాణాలను వెంటనే సీజ్ చేసి కేసు నమో దు చేయాలని కులవృ పోరాట సంఘం జిల్లా కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. రొద్దం మండలంలో కల్తీ కల్లును నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, అంజి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న కోర్టు కాంప్లెక్స్ నుంచి చెళ్లికేర్ క్రాస్ వరకూ కాలిపోయిన కేబుల్ మార్చే పనుల కారణంగా పావగడ టౌన్ ఫీడర్‌లో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికా రులు తెలిపారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరంలో లక్ష్మిచెన్నకేశవస్వామి రథోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే మడుగు తేరు రథోత్సవం కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు సూదన్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న వేణుగోపాలస్వామి, సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి నియామకానికి శ్రీ సత్య సాయి జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహారాజు నోటిఫికేషన్ ను విడుదల చేశారు. ధర్మకర్తల మండలి నియామకానికి కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, అసక్తిగలవారు 20రోజుల లోపు దరఖాస్తులను భర్తీచేసి శ్రీ సత్యసాయి జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయానికి అందజేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని కె పూలకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నాగభూషణ్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ ఎం.రవి కుమార్ రెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సుమియారఫీ, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహ రెడ్డి, రమణా రెడ్డి, అక్బర్, గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్థికాభివృద్ధికి సమిష్టి కృషి : డిపిటిఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఆర్టీసీ ఆదాయ మార్గాలను అన్వేషించి లాభాల బాటలోకి తీసుకెళ్లడానికి సమిష్టిగా అందరూ కృషి చేద్దామని డిపిటిఒ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్, పర్సనల్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి అధికారులందరూ కృషి చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రతి బస్సు రూటుకు వెళ్లే ముందు పనితీరుని సమీక్షించాలని సెక్టర్ వారిగా పనితీరు బాగాలేని సర్వీసులను రీసెంట్ చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా కండక్టర్లకు డ్రైవర్లకు గ్యారేజ్ సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. దూర ప్రాంత సర్వీసులలో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులు శుభ్రంగా ఉంచాలని ప్రయాణికుల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా కెఎంపిఎల్‌ను పెంచడంతోపాటు బ్రేక్ డౌన్లను తగ్గించి ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించాలని అన్నారు. అదేవిధంగా పవిత్ర పుణ్యక్షేత్రాలకు నదీ పుష్కరాలకు ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రతి డిపో నుంచి అరుణాచలం, ధర్మస్థలం, రామేశ్వరం తో పాటు దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాలకు, అలాగే వేసవి సెలవులను పురస్కరించుకొని పర్యాటక కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాల ద్వారా రైతులకు లబ్ధి

కదిరి టౌన్ : ప్రభుత్వాల సహకారంతో గ్రామాలలో రైతులు పదిమంది సంఘంగా ఏర్పడితే అధ్యా ఫార్మర్స్ కంపెనీ ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని కదిరి ఏడిఏ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కదిరి పట్టణంలోని ఎన్జీవో హోంలో అతియా ఫార్మర్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎడిఎ సత్యనారాయణ, ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. అతియ ఫార్మర్స్ కంపెనీ రైతులకు అండగా నిలుస్తోందని ఆ కంపెనీ సిఇఒ వెంకటేష్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం మేలు చేకూర్చేందుకు రైతు సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాకు ఎఫ్ ఈ ఓ సంఘాలు కోసం అనుమతి ఇచ్చిందని ఆతియా ఫార్మర్ కంపెనీ తరపున శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైతులను, పాడి రైతులను ఆదుకునే విధంగా కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించిందని చెప్పారు. ఈ కంపెనీ ద్వారా రాయితీతో రైతుల పొలాలలో రాళ్లు తొలగించడం, మల్చింగ్ షీట్లు, వ్యవసాయ యాంత్రికరణ ద్వారా పొలాలలో దుక్కి దున్నడం, తార్పల్ పట్టలు, గడ్డి కోసే మిషన్లు, పండ్ల మొక్కలు, డ్రిప్పు పరికరాలు, రైతు ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వంటివి రైతులు పొందవచ్చు అన్నారు. కంపెనీ సిఇఒ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ పాడి రైతుల కోసం గేదెలకు సబ్సిడీతో కూడిన దాణాను, ఎరువులు ,విత్తనాలను, సబ్సిడీతో అందజేస్తామని చెప్పారు. సంస్థ తరపున మామిడి, చీనీ, వంటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కదిరి, నల్లమాడ ,తలుపుల మండలాలకు సంబంధించి రైతు సంఘాలలో ఉండే రైతులకు సబ్సిడీతో టార్పాల్ పట్టలను ఈసందర్భంగా పంపిణీ చేశారు

యుటిఎఫ్ పోరాట ఫలితం.. మున్సిపల్ అప్ గ్రేడ్ టీచర్ పోస్టులు మంజూరు..!

ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరాట ఫలితమే మున్సిపల్ అప్‌గ్రేడ్ టీచర్‌పోస్టుల మంజూరు అని యుటిఎఫ్ నాయకులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ హై స్కూల్స్ లో సుమారు 1800 పోస్టులు హై స్కూల్ హెడ్ మాస్టర్స్, స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేశారన్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో మున్సిపల్ ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి, హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, జిల్లా మునిసిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లె రామాంజినేయులు, స్థానిక నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, సాయి గణేష్, రామాంజనేయులు, ఆదిశేషు, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల ఎంపీడీవోగా నసీమా

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల ఎంపీడీవోగా కె .నసీమా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె ఆమడగురు, తలుపుల ఇన్‌చార్జి ఈవోఆర్డీగా విధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతిపై తలుపుల ఎంపీడీవోగా వచ్చారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - తలుపుల

ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ లో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్నటువంటి హై రిస్క్ గర్భిణులకు డాక్టర్ ఎస్ డి.అఫ్తాఫ్, డాక్టర్.అశ్రిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 67 మంది గర్భిణులను పరీక్షించగా అందులో 11 మందికి రక్త హీనత ఉన్నట్లు గుర్తించామన్నారు. 14 మందిని ఉచిత అల్ట్రా సౌండ్ స్కానింగ్ కొరకు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. ఈసందర్భంగా గర్భిణులకు వైద్యులు పలు సూచనలు చేశారు.

కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి తలుపుల

మండల పరిధిలోని లక్కసముద్రం పంచాయతీ పరిధిలోని శుక్రవారం కిషోరి వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై బాల్య వివాహంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శైలజ, రమాదేవి, గోవిందమ్మ, కృష్ణమ్మ, శకుంతల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

హెచ్ఐవి / ఎయిడ్స్ నియంత్రణపై మండల కేంద్రంలో సరోజమ్మ కళాబృందంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రం లోని ప్రధాన మార్కెట్ సర్కిల్‌లో ప్రదర్శించిన వీధినాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ముదిగుబ్బ వైద్యాధికారి డాక్టర్. రాజేంద్ర, ఐసిటిసి కౌన్సిలర్ వెంకటనారాయణ, శక్తి మైత్రి మహిళా సంఘం పి.యూ ధర్మవరం ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కుమార్, ఒఆర్‌డబ్ల్యూ త్రివేణి షాహిదా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపీ జెఎసి చైర్మన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉమ్మడి జిల్లా అనంతపురంలో జరిగే సర్వ సభ్య సమావేశానికి వెళుతుండగా మార్గ మధ్యలో కర్ణాటక బాగేపల్లి టోల్ గేట్ వద్ద ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ ఎస్. హెచ్. ఎ. మైనుద్దీన్, మహిళా విభాగం చైర్మన్ విజయ భారతి, జిల్లా వైస్ చైర్మన్ గిరిధర్, కార్యదర్శులు చంద్రశేఖర్, రొళ్ల తహశీల్దార్ షేక్షావలి, అమరేంద్ర తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

మ్యాట్రీ'మనీ' మోసం

వాట్సప్ గ్రూప్‌లో పరిచయం
యువతిని ట్రాప్ చేసిన ముఠా
పెళ్లి.. ఉద్యోగం అంటూ వల...
నమ్మిన యువతి వద్ద 40 గ్రాముల బంగారు అపహరణ..
పోలీస్ స్టేషన్‌కి చేరిన పంచాయితీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

'నేను ప్రభుత్వ విజిలెన్స్ అధికారి అని నిన్ను పెళ్లి చేసుకుంటానని అలాగే ఉద్యోగం ఇప్పిస్తాన'ని నమ్మించి ఓ నిరుపేద యువతిని నయవంచకులు మోసం చేసిన ఘటన చిలమత్తూరు మండలంలో చిన్నపరెడ్డిపల్లిలో వెలుగుచూసింది. అందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... నెల్లూరు టౌన్‌కు చెందిన యువతి ప్రస్తుతం బెంగుళూరు లోని తన అక్క ఇంట్లో ఉంటూ, బీపీఓ గా పని చేస్తోంది. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఈ యువతి జీవనోపాధికి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోంది. అలాగే మాట్రీమనీ వాట్సప్ గ్రూపులో తన పేరును నమోదు చేసుకుంది. ఇదే విధంగా మండలంలోని చిన్నపరెడ్డిపల్లికి చెందిన నరేష్ తన ప్రొఫైల్‌ను మాట్రీమనీ లో నమోదు చేసుకున్నాడు. తను విజిలెన్స్ అధికారిగా బయోడేటా అప్లోడ్ చేశాడు. ఈ క్రమంలో నరేష్ ఆ యువతిని పరిచయం చేసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఆ యువతి . ఆమె అక్క అంగీంకరించారు. నరేష్ ప్రభుత్వ ఉద్యోగి అని తెలియడంతో సంతోషపడ్డారు. నెల రోజులుగా ఫోన్లో మాట్లాడాడు. తనకు ఉద్యోగం ఉందని 'నీకు ఉద్యోగం ఇప్పించి పెళ్లి చేసుకుంటాన'ని నమ్మించాడు. 'నీవు నాకు రూ.2 లక్షలు ఇస్తే మంచి ఉద్యోగం ఇప్పిస్తా' అని చెప్పాడు. అతని మాటలు నమ్మిన యువతి తన వద్ద ఉన్న 40 గ్రాముల బంగారాన్ని అతనికి ఇవ్వటంతో ఆ బంగారాన్ని బాగేపల్లి ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో పెట్టి, నరేష్ రూ.1.93లక్షల నగదు తీసుకున్నాడు. అంతటి మొత్తాన్ని తీసుకున్న నరేష్ తరువాత యువతిని పట్టించుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు 8 మేన నరేష్‌ను నిలదీసింది. దీంతో నరేష్ ఆ యువతిని బెదిరించాడు. దీంతో బాధితురాలు చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నరేష్ ని విచారించగా తప్పు ఒప్పుకొని తన బంగారాన్ని తన స్నేహితుల సహాయంతో విడిపించి చిలమత్తూరు పోలీస్ స్టేషన్ ఆ అమ్మాయికి ఇచ్చాడు. అయితే ఇదే తరహాలో అనంతపురంలోని యువతిని ఇదే యువకుడు మోసం చేసి ఆమె పేరిట ఉన్న భూమిని తాకట్టు పెట్టి డబ్బు కాజేసినట్లు ఆ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేసి అమాయక యువతులు మోసపోకుండా అడ్డకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు శ్రీ సత్య సాయి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఘన స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజవర్గం వజ్రకరూర్ మండలం చాయాపురం వద్ద హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనుల పరిశీలనకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి 12 గంటల ఒక్క నిమిషానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి రాష్ట్ర మంత్రులు సవితమ్మ, టిజి భరత్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి,ఎమ్మెస్ రాజు,కందికుంట వెంకట ప్రసాద్,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి , జిల్లా కలెక్టర్, టీఎస్ చేతన్, జేసి అభిషేక్ కుమార్, ,ఎస్పీ వీ రత్న , మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, తెలుగుదేశం జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ,స్థానిక ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు ఆర్డీవో సువర్ణ,పుట్టపర్తి నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు సిఎం కు ఘన స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం లోని వజ్రకరూరు మండలం చాయాపురానికి హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల ప్రారంభోత్సవంతోపాటు పనులు పరిశీలనకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 12. 18 నిమిషాలకు ప్రత్యేక హెలికాప్టర్లో బయలుదేరి వెళ్లారు.

హిందూపురం: హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించేందుకు శుక్రవారం అనంతపురం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కలిశారు. విమానాశ్రయంలో శ్రీ సత్య సాయి జిల్లా టిడిపి అధ్యక్షులు కొల్లకుంట అంజనప్పతో కలిసి డిఈ రమేష్ కుమార్ ముఖ్యమంత్రికి బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, మాజీ సర్పంచ్ హెచ్.ఎన్. రాము తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సత్య సాయి శతజయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేయండి



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సత్య సాయి బాబా 100వ జయంతోత్సవాల సందర్భంగా అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా విన్నవించారు. శుక్రవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు పుట్టపర్తి విమానాశ్రయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే సిఎంకు వినతి పత్రాన్ని సమర్పించారు. సత్యసాయి 100వ జయంతోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 120 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా 2018లో టిడిపి ప్రభుత్వ హాయంలో కొత్త చెరువు మండల కేంద్రంలో రూ 2 కోట్లతో మంజూరైన ఇండోర్ స్టేడియం అర్ధాంతరంగా ఆగిపోయిందని వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గం లోని ఎస్టీ కాలనీల్లోని 81 పనులకు సుమారు రూ.5.50కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలో 135 సిసి రోడ్ల నిర్మాణానికి రూ.8.10 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభ పరిస్థితిలో కూడా ఎస్సీ కార్పొరేషన్‌కు 344 కోట్ల రూపాయలు బడ్జెట్ నిధులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధుల కేటాయించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు.